కథా నిలయం
4746
శ్రీకాకుళం

# 'పిచ్చివాళ్ళ' మనస్తత్వం

రోజూ జరిగే అనేకసంగతులు అన్నీ కాకపోయినా కనీసం కొన్నయినా విచిత్రంగానే వుంటాయి. కొంతసేపు 'అదలా సాధ్యమా' అని ఆలోచించేటట్లుకూడా చేస్తాయి. అలాంటి వాటిదే నేను చెప్పేదికూడా. సుబ్బయ్యగారి 'బాబ్జీ'కి పిచ్చెక్కిందట! ఈవిషయాన్ని నిజంగా నమ్మాలంటే చాలా కష్టం. అయినా 'బాబ్జీ'కి పిచ్చెక్కటమంటే సామాన్యమా? వాడసలు దేన్నిగురించి సరిగ్గా ఆలోచించనయినా ఆలోచించడు. పైపెచ్చు ఏడుతరాలు అటువైపు ఇటువైపు గాలించినా పిచ్చి వాళ్ళు ఇంట్లో ఎవరికీ లేదాయెను. ఎలా నమ్మటం? అటువంటప్పుడు ఇంత చిన్నవయస్సులో, వున్నట్టుండి బాబ్జీ పిచ్చివాడయాడంటే నిజంగా ఆశ్చర్యమే ఎవరికయినా. ఇంతకీ ఈవార్త మోసుకొచ్చిన మూర్తి మాటలు నమ్మాలంటే మనస్సు వప్పుకోవటంలేదు. పైపెచ్చు మూర్తి మాటలు నమ్మాలంటే భయంకూడా వేస్తుంది. పోయినసారి మాత్రం శర్మగారు 'పోయారని' చెప్పగానే నేను నెత్తినోరు బాదుకోలేదూ? పైగా శర్మ ఏదో కారు ప్రమాదంలో చిక్కుకుని చివరకు దిక్కు లేని చావు చచ్చాడని చెప్పినపుడు నేనెంతసేపు బాధపడ్డానో, ఎంతకన్నీరు వృధాచేసానో నాకీనాడు బాగాగుర్తువుంది. శర్మకు నాకూ వుండిన పరిచయం శర్మ దూరమైనాడే అన్న బాధకుతోడు 'స్ప్రింగు' కాఫీ

ఓకప్పు తగిలించి, ఘుమాయించే వక్కపొడి నముల్తూ లేని సిగరెట్ అలవాటును అరువు తెచ్చుకొని ఎన్నోసిగరెట్లు తగలేసి, చేతనయిన కవిత్వాన్నంతా ఉపయోగించి సానుభూతి ఉత్తరం శర్మ ఇంటివాళ్ళకు రాసిన మూడవరోజునే నావుత్తరానికి సమాధానముకూడా తిరిగివచ్చింది శర్మదగ్గరనుంచి. తానింకా బ్రతికేవున్నానని, పైగా వుద్యోగంలో ప్రమోషను కూడా వచ్చేటట్లుందని.

నాకునవ్వాలో ఏడవాలో అర్థంకాకపోయినామూర్తి మీదమాత్రం బ్రహ్మాండమయిన కోపం వచ్చేసింది. తానేగనక దగ్గరవుండివుంటే తప్పకుండా లెంపలువాయించేసి వుండేవాడిని. అయినా వుండబట్టలేక వున్నపళాన పరుగెత్తికెళ్ళి వాడిని రూంలో కలుసుకొని నోటికొచ్చినట్లు చీవాట్లు పెట్టాను. కోపం చల్లారినతర్వాత 'ఏరా వెధవా అలాచెప్పావ్' అంటే వాడంటాడు 'నాకుమాత్రం ఏంతెలుసు గోఖలే చెప్పాడు' అంటూనే తప్పించుకోజూచాడు. నాకుమాత్రం బాగా తెలుసు గోఖలే అలా చెప్పడని. కాని ఇంకా వాదిస్తే మూర్తి దగ్గరనుంచి వచ్చే సమాధానం తెలుసు కాబట్టి ఆ ప్రసంగం అంతటితో ఆపేద్దామని "అదిసరేలేగాని, ఇప్పుడు నీకేం పనిలేదుకాబట్టి అలాపోయి కాఫీత్రాగివద్దామా?" అని అడిగేనో లేదో పాచిమొఖం వాడూ తయారు. పళ్ళు ఇకిలించుకుంటూ నిమిషంసేపులో తయారయ్యాడు కాఫీకి. అయినా కాఫీఅంటే ప్రతివాడికిఅదోపిచ్చి. పిచ్చంటేమాత్రం

వప్పుకోరు. ఫయిళ్ళలో తలదూర్చి నిమిషంసేపు విరామం లేకుండా పనిచేసేవాడితో ఏ పనివచ్చినా సార్ అలా కాఫీకి పోయి వద్దాంరాండి అంటే కోటు కట్టేసి చక్కావచ్చి ఆ గుక్కెడు నీళ్ళు త్రాగేసింతర్వాత మనం ఏం చెప్పినా చేసి పెడ్తాడు. అలాంటప్పుడు మూర్తిగాడేం ఖర్మ ఎవరికయినా ఏదయినా పని చెప్పి, ఓ కప్పు కాఫీ పోయిస్తే విసుగు విరామం లేకుండా పనులు చేసిపెడ్తారు. అందుకనే కాఫీ త్రాగే వాళ్ళం దరుకూడా అదోరకం పిచ్చివాళ్ళేమరి. అసలు, ఇంతకీ సంగతి చెప్పటం మరచిపోయాను. అటువంటి మూర్తి బాబ్జీకి పిచ్చని చెపితేమాత్రం నేను నమ్ముతానా? అసలు మూర్తేకాదు మరింకెవరయినా బాబ్జీకి పిచ్చనిచెబితేమాత్రం నమ్ముతానా! నిన్నంటె నిన్నకదూ బాబ్జి సినిమాకివెళ్తూ కన్పించింది. అప్పుడు వాడెంత వుల్లాసంగా వున్నాడు! వద్దురా బాబూ అంటున్నా ఐస్క్రీం తినేవరకు వదలనేలేదు కదూ వాడు. అయినా లోకానికి ఎవరిమీదో ఏదోవకటి ఫుట్టించకబోతే నిద్రరాదు లాగుంది. లేకపోతే మరేమిటి. ఏడెనిమిది రోజుల క్రితమేకదూ పక్కింటి తిరుపతమ్మ కోడలు లేచిపోయిందని వూరంతా కోడై కూచింది. నేనుమాత్రం ఇతరులవిషయాలు పట్టించుకోను కాబట్టి ఆ విషయం పెద్దగా పట్టించుకో పోయినా, వాళ్ళువీళ్ళు అనుకోవటంలోనే తెలిసింది తిరుపతమ్మ కోడలు లేచిపోలేదని. మదనపల్లి శానిటోరియంలో క్షయ వ్యాధి చికిత్సకోసం ఆమెను చేర్పించారట. క్షయని తెలిస్తే

నల్లురిలో చిన్నతనమని తిరుపతమ్మగారు ఆ విషయం బయటికి ప్రొక్కనీయకపోగా, కనీసం మదనపల్లెలో చేర్పించినట్లుకూడా ఎవరికి తెలియనివ్వక పోవటంలో ఆ దుమారం లేచింది.

టైము అప్పుడే తొమ్మిదిన్నర దాటింది. ఇంకో పదినిమిషాల్లో కనీసం కొంచెం అటో ఇటో ఆలస్యమయినా రౌండ్ తానా దగ్గరకు వెళ్ళటం తప్పదు నాకు. నేను తానా చేరేటప్పటికి కనీసం ఓ ఐదు నిమిషాలయినా ముందుగానే సురేఖ తప్పక వస్తుంది. రాగానే నేను వస్తున్నానేమోనని దిక్కులన్నిటి వైపుచూస్తూ బస్సుకోసం నిరీక్షిస్తూవుంటుంది. ఆతృతలో వెతికే ఆ కళ్ళకు నేను కన్పించకపోయేటప్పటికి ఎక్కడలేని విసుగు వచ్చేస్తుంది రేఖకు. ప్రొద్దున్న కాచే చిరుఎండకు చికాకుగావున్న మనస్సుతోడై చిరుచెమటలు పోస్తుంటే తుడుచుకుంటూ నాకోసం ఎదురుచూచే రేఖ చూడ ముచ్చటగా వుంటుంది. మరీ ఆలస్యమయితే నామీదవచ్చిన కోపాన్ని చేతిలోవున్న కర్చీఫుమీద చూపిస్తుంది. దాన్నిలక్షమడతలు వెయ్యటంలోనూ, అంచును నోట్లో పెట్టుకొని కొరకటంలోనూ. అసలు నేను తానా దగ్గరకు వెళ్ళినా లేకపోయినా, రేఖకు ఇష్టంవున్నా లేకపోయినా పదిగంటల బస్సెక్కి వెళ్ళాలి రేఖ. వుద్యోగంకోసం సమానస్థాయిలో పోట్లాడవలసిన ఈ రోజులలో, వచ్చిన వుద్యోగానికి ఆలస్యంగా వెళ్ళటం ఇష్టంవుండదు రేఖకు, వెళ్ళినా బహుశా వూరుకోరుకూడాను. ఇదంతా ఎలా వున్నా నేను ఇంక పదినిమిషాలలో వెళ్ళకపోతే.... బాబోయి

రేఖ బాధపడదూ.?

త్వరగా డ్రెస్ చేసుకోవటం ముగించుకున్నాను. ఒక సారి దృష్టిని అలా బయటికి మరల్చాను. ఎండ లేదు. ఆకాశంలో మబ్బులు దట్టంగా ఆవరించుకున్నాయి. వాతావరణం ఏమీ బాగా లేదు. ప్రొద్దున్న ఆరుగంటల్లావుంది. ఎండ బాగావుంటే భరించలేక తిట్టుకుంటాం. ఎండ లేక మసగ్గావుంటే కొంతమందికి బాగుంటుందేమోగాని నాకు మాత్రం మనస్సులో ఏదో వెలితిగావుంటుంది. అసలు అలా అనుకోవటం అనిపించటంకూడా అదొకరకమైనపిచ్చి.కొందరు దాన్నే మానసిక బలహీనత అంటారేమో. డాక్టరు కేసు అర్థంగాక పోయినా, కేసులో ఏమీ లేదని తెలిసినప్పుడయినా సాధారణంగా అంటూవుండే మానసిక బలహీనత లాంటిదే ఇదికూడా. మసగ్గావుంటే బయటికి బయల్దేరాలనే వుండదునాకు. దుప్పటి కప్పుకొని వెచ్చగా ఫీలవుతుంటే ఓకప్పు వేడికాఫీ త్రాగాలని వుంటుందినాకు. కాఫీ త్రాగేటప్పుడు రేఖలాంటివాళ్ళు ప్రక్కనేవుండి చల్లటికబుర్లు చెబుతూవుంటే వేడికాఫీ ఇంకా బాగావుంటుందనుకోండి. కాని ఇష్టం లేకపోయినా రేఖకోసం బయలు దేరటం తప్పనిసరయింది.

రూం తాళంవేసి చెవి జేబులోవేసుకొని రోడ్డుమీద రెండడుగులు వేసానో లేదో టపటపమంటూ రెండు చినుకులు నెత్తిమీద పడ్డాయి. ఆకాశంవైపు చూశాను. పెద్ద వర్షం పడుతుందేమోననుకున్నాను. కాని లోపలికి వెళ్ళి

రెయిన్‌కోటు తెచ్చుకోవాలంటే బద్ధకం వేసింది. అయినా అంతగా వర్షమేగనుక వస్తే రిక్షాలో రౌండ్ తానాకు పో వచ్చులె ననుకుంటూ కాళ్ళీడ్చుకుంటూ బయలుదేరాను.

రాముడి పాన్ షాపు దగ్గరకొచ్చి ఆగాను. ప్రతిరోజూ అదేసమయానికి రాముడి కొట్టుదగ్గరొక వక్కపొడిపొట్లాన్ని కొనుక్కోవటం నాకలవాటు, వక్కపొడి నములుకుంటూ నడవకపోతే వెర్రెక్కినట్లుంటుంది నాకు. అలవాటు ప్రకారం కొట్టుదగ్గర ఆగేనోలేదో సోడాకొట్టిన శబ్దం వినిపించింది నాకు. ప్రక్కకు తిరిగిచూచాను. రాజు నావైపుమాత్రం చూడటంలేదు. వాడివైపే కొంచెంసేపు చూడాలనిపించింది. చూస్తునిలబడ్డాను. ఒకదానితర్వాత మరొకటిగా మొత్తం మూడైనా త్రాగందే వదలడువాడు. మూడుసోడాలు త్రాగి 'బ్రేవ్' మని త్రేన్చి పొట్టచేతితో రుద్దుకుంటేగాని వాడికి తృప్తివుండదు. అవునుమరి అదోపిచ్చి వాడికి.

సోడాపని పూర్తిచేసుకొని సంతృప్తిగా నావైపు చూస్తు చిరునవ్వునవ్వాడు రాజు. ఏరారాజుబాగున్నావా! ఏమిటీమధ్య బొత్తిగాకన్పింటంలేదే. వూళ్ళోలేవా ఏమిటి?, అని అన్నానోలేదో.

"అదేప్రశ్న నిన్నడిగితే నువ్వేం చెప్తావయ్యా పెద్ద మనిషి అయినా ఈమధ్య మాకందే పరిస్థితుల్లోవుంటున్నా వట్లే. నీ కళ్ళకి రేఖలావుంటే తప్పితే మేమంతాకన్పిస్తామా?'

నిష్ఠూరమంతా నామీదనేవేసి జవాబిచ్చాడు రాజు. అసలు కొంతమంది మాట్లాడితేనే తప్పంతా మనదే నన్నట్లు సమాధానమిస్తారు. 'రాముడూ ఓ సోడాకొట్టు మావాడు కూడా త్రాగుతాడు....' నవ్వొచ్చిందినాకు.

'ఒద్దులేరా, నీపిచ్చి నాక్కూడా పట్టిద్దామని నీ అభిప్రాయమా! అదిసరేలే రాముడూ ఓ 'లాలాజీ' పొట్లాం ఇలాపడేయి. ఆఫీసుకు టైమయింది. రాముడి నుద్దేశించి అన్నాను.

వక్కపొట్లాం తీసుకొని వెళ్ళబోతూవుంటే "రాండ్ రానా వైపేకదూ; అటువైపు నాక్కూడా కాస్త పనుంది. నేనుకూడా నీతో వస్తాలే పద" అంటూ వెంటబడ్డాడు రాజు. వాడు నాకూడా రావటం ఇప్పట్లో నాకుబొత్తిగా ఇష్టంలేదు ఎందుకంటే అసలే నోరుజారే తత్వం వాడిది. రేఖ దగ్గర అలానే ఏదోఒకటి అన్నాడంటే రేఖమాత్రం ఆమాటల్ని తేలిగ్గా తీసిపారవెయ్యలేదు.

'ఏరా డబ్బేమయినా కావాలేమిటి. నావెంట పడ్డావ్ ప్రొద్దునే' నవ్వుతూనే అన్నాను రాజుకాబట్టి. అసలు సంగతేమిటంటే రాజుని వెక్కిరించినా ఎగతాళిచేసినా ఏమీ అనుకోడు. బాధపడడు. అందువల్లనే రాజంటే నాకు విపరీతమయిన అభిమానం. వాడితో ఎక్కడికి వెళ్దామన్నా ఎంతో సరదా కూడాను.

"అంత అవసరమే వుంటే నీ దగ్గరకు వెతుక్కుంటూ రెక్కలు కట్టుకొని వచ్చివాలివుండేవాడినికదూ! అది సరేగాని ఇంతకీ ఇది విన్నావా మన 'బాబ్జీ' గాడికి నిన్నసాయంత్రం వున్నట్లుండి పిచ్చిపట్టిందట"

ఆశ్చర్యంతో రాజువైపు చూశాను. ఈసారి నమ్మకుండా ఎలావుండగలను? "ఏరా నమ్మమంటావా? అసలు అది నిజమేనంటావా. ఎందుకంటే ఇవ్వాళ ప్రొద్దునే మూర్తికూడా ఇదేవార్త మోసుకొచ్చాడు. అయినా అది 'మూర్తిగాడి మాటే' గదా ననుకుంటూవుంటే నువ్వుకూడా అలానే అంటున్నావే. కొంపతీసి నీక్కూడా మూర్తి చెప్పలేదుగదా ?"

"నీ బొందలే మూర్తి నాకు చెప్పటం ఏమిటి. నేనే వాడికి చెప్తేను. నిన్న సాయంత్రం వెంకటేశ్వరరావు... అదే సుబ్బయ్యగారి ప్రక్క వాటాలో వుంటాడే...అదేరా మనం 'వెంకూ' అని పిల్చేవాళ్ళమే వాడు కన్పించి చెప్పాడు. బాబ్జీ వున్నట్లుండి పెద్దగా అరుస్తు వచ్చే పోయేవాళ్ళ మీద రాళ్ళు వేయటం ప్రారంభించాడట'

"అదేం రోగం వాడికి"

"అదేనోయ్ పిచ్చంటే. అసలు వాళ్ళు ఏ విషయం గురించి పట్టించుకోరు తెలుసా. ఇది మంచి, ఇది చెడు అనే విచక్షణాజ్ఞానం ఎలాగో నశిస్తుంది వాళ్ళకు. వున్నట్లుండి

బావిలో దూకమంటే దూకుతారుకూడా పిచ్చివాళ్ళు. అసలు నిన్ననేం జరిగిందంటే బాబ్జీ సుబ్బయ్యగారి దగ్గరకెళ్ళి అన్నాడట. నాన్నా నాన్నామన బామ్మకి పెళ్ళిచేద్దామా?,, అని. ఆయనేమో విస్తుపోయాడట. నోటమ్మట మాట కూడా రాలేదట. అయినా విస్తుపోడూ మరి. మొగుడుపోయి ఇరవైఏళ్ళవగా, మూలనే అంటిపెట్టుకొని కాటికోసం కాళ్ళు చాచుకుని కూర్చున్న ముసలిదాన్ని పట్టుకుని బాబ్జీ అలా అంటే మరి ఆయనకు నోటమాటెలా వస్తుంది.

శాస్త్ర తేరుకుని 'ఏమిట్రా అంటున్నావు" అని అన్నాడో లేదో "నువ్వెప్పుడూ ప్రతిదానికీ అడ్డం చెబుతూనే వుంటావు." అని లెంపకాయ కొట్టాడట. ప్రక్కనున్న పెద్దమనిషి నోరు తెరుచుకొని గ్రుడ్లప్పగించి చూస్తుంటే వీపుమీద రెండు వీశ గుద్దులు గుద్ది రోడ్డుమీదకు పారిపోయి ఇష్టంవచ్చినట్లు అరుస్తూ వచ్చేపోయే వాళ్ళమీద రాళ్ళు రువ్వటం ప్రారంభించాడట. అబ్బో చూసినవాళ్ళు చెప్పారుగా. ఒకటే రాళ్ళవర్షంట!"

"నిజమా?" అంతకన్నా ఏమనాలో తోచిందికాదు నాకు; అసలు రాజు చెప్పేదంతా ఎలా నమ్మాలో అర్థం కాలేదు నాకు.

'నిజమా ఏమిట్రా పిచ్చిసన్యాసి. ఎవరో పట్టుకోబోతే నడుంమీద దుడ్డుకర్రతో బాది, ప్రక్కనున్న మర్రి

చెట్టు వూడల్ని పట్టుకొని అటూఇటూ గెంతుతూ "మై టార్జాన్ కాబేటా.... హ హ హ — జింబోనగర ప్రవేశం అంటూ టార్జాన్ సినిమాల్లో గార్డెన్ స్కాట్ అరిచినట్లు.... అదెలా రెండుచేతులు నోటిదగ్గరపెట్టుకొని 'కుయ్యో' మని అరుస్తాడే. అలాకూస్తుంటే అయిదారుమందికలిసి వాడిని అమాంతంగా పట్టుకొని కాళ్ళుచేతులు కట్టేసి. అయినా నమ్మకం కుదరక చెట్టుకుకూడా కట్టేసారట." రాజు జరిగిన సంగతంతా వర్ణించుకుంటూ వచ్చేటప్పటికి కొంచెం ఆలస్యం జరిగేవుండవచ్చు.

రౌండుతానాదగ్గర రేఖ నాకోసం ఎదురుచూస్తూ కన్పించింది. "ఒరేయి, మిగతాది తర్వాత చెప్దూగానిలే రేఖ ఒక్కతే వెయిట్ చేస్తువుంది నేనక్కడికి వెంటనే వెళ్తాను. నువ్వు సాయంత్రం ఓమారు కన్పిస్తావుగదూ?" అంటూనే వున్నాను. 'వెళ్ళమంటున్నావా కృతఘ్నుడా' అన్నట్లు రాజు నావైపు ఓమారుచూచి 'విష్ యూ గుడ్ లక్' అంటూ వచ్చినదారినే నిష్క్రమించాడు రాజు.

'రేఖా ఇవ్వాళ చాలా ఆలస్యమయిందికదూ. సారీ .. అందులోనూ ఇవ్వాళ వాతావరణమేమీ బాగోలేదు. లేవటానికే బద్దకంవేసింది. అయినా ప్రొద్దునే మృదువైస చేతులతో ముచ్చటగాలేపే అర్ధాంగివుంటే ఎంత బాగుంటుంది. ఏమిటో .... నువ్వేగానివుంటే ఇలా జరుగుతుందా!'

నవ్వింది రేఖ

రోజూ నేనలా అనటం .... ఆమె నవ్వటం పరిపాటే అలా అనుకోవటం పైకిఅనటం నాకలవాటు. అలవాటు అనే కంటే అదొక పిచ్చిఅంటే బాగుంటుందేమో. నా పిచ్చి నాకానందం.

“ఓపిక పట్టినన్నాళ్ళు ఇకమీద వుండబోరుగా మీరు. దేనికయినా సమయంరావద్దూ?’ అయినా ఇవ్వాళ నేనే ఆల స్యంగా వచ్చాననుకుంటే నాకంటే ఆలస్యంగా వచ్చారే” గోళ్ళను పళ్ళతో కొరుకుతూ అడిగింది రేఖ. ఆడవాళ్ళు గోళ్ళు కొరుకుతూ మాట్లాడితే సహించనునేను. ఎన్నిసార్లు చెప్పినా మర్చిపోయి అలవాటుప్రకారం మాట్లాడేటప్పుడు గోళ్ళుకొరుకుతూనే వుంటుంది రేఖ. అదొకపిచ్చి ఆమెను.

‘ఆగోళ్ళు కొరకటంమానేస్తే చెప్తాను ఎందు కాలస్య మయిందో, నాఫ్రెండొకడు ‘బాబ్జీ’ అని వున్నాళ్ళే. గొప్ప ఆస్తిపరుడు. చక్కగావుంటాడు. బుద్ధిమంతుడు. పైగా ఈ మధ్యనే ఎవర్నో ప్రేమిస్తున్నాడనికూడా విన్నాను. కాని ఖర్మంకొద్ది అమాంతంగా నిన్నసాయంత్రం వున్నవాడు వున్నట్లే పిచ్చివాడయిపోయాడు. కారణంమాత్రం అంతు పట్టటంలేదు. ప్రతివాడూ తలొకరకంగా చెప్పుకుంటున్నారు. ప్రేమలో పడ్డతర్వాతనే ఈగతి పట్టిందని. బి. ఏ. లో ఇంగ్లీషుపార్టు పోవటంతో మతిస్థిమితంలేక ఇలా తయా రయ్యాడని, నిన్నసాయంత్రమే అది పిచ్చిగామారిందని ఇలా

ప్రతివాడూ ఏదో ఒకటి చెబుతూనేవున్నాడు. నిన్నరాత్రే విశాఖపట్నం తీసుకెళ్ళారట. ఇదంతా రాజు చెప్తూవుంటే ఆలస్యం అయిందనుకో. అయినా నీబస్సు రాకముందే వచ్చేసాగా. ఏమిటి సంగతులు...." సంభాషణ పొడిగించాలని అన్నాను.

"విచిత్రంగావుందే ఇదేమన్నా పిచ్చిసీజనా ఏమిటీ? మొన్నప్రొద్దునే మాఆఫీసరుగారి పెద్దమ్మాయికి ఇలానే వున్నట్లుండి పిచ్చిపడితే ఏదోవూరు బహుశా వైజాగేనేమో తీసుకెళ్ళారునిన్న. రెండురోజులు తిరగకముందే మళ్ళీ ఈ వార్త మోసుకొచ్చారు మీరు. నిజంగా ఆశ్చర్యంగానే వుంది" రేఖ నావైపుచూస్తు చెబుతూనేవుంది బస్సువచ్చి ఆగింది, ఎదురుచూచేబస్సు. టాటాచెబుతూ రేఖ బస్సు ఎక్కబోయేంతలో బస్సు కదలనే కదిలింది. రేఖ పడుతుందేమోనని అనుకున్నాను. కాని బ్రతికించింది. లేకపోతే ఆఫీసుకు బదులు హాస్పటల్ కు వెళ్ళాల్సివచ్చేది.

సాయంత్రం రేఖ బీచిదగ్గర కన్పించింది.

కన్పించగానే మనస్సు పురక లెత్తింది. రేఖ బీచికి వస్తుందనిమాత్రం నేను అనుకోలేదు.

"అలా క్యాంటీన్ వైపు వెళ్దామా, ఆకలివేస్తుంది." రేఖ అడగగానే ఏమీఅనకుండా ఆమె వెనకనేవెళ్ళాను.

ఓ టేబుల్ దగ్గర కూర్చున్నాం ఇద్దరం.

"రేఖా రేపు నువ్వొక్కదానివే వెళ్తావు కాబోలు ఆఫీసుకు"

"ఏం" అయోమయంగా చూసింది రేఖ.

"ఆశ్చర్యపడవలసిందేమీ లేదుఇందులో. రేపు బాబీని చూడ్డానికి వైజాగ్ వెళ్దామనుకుంటున్నాను, బహుశా ఓ రెండు మూడు రోజులయినా పడుతుందేమో నేను తిరిగి రావటానికి," చెప్తూనే వున్నాను నాకో బ్రహ్మాండమైన ఆలోచన మనస్సులో మెదిలింది. కాని రేఖఏమంటుందేమో నని భయం భయంగానే అడిగేను.

"రేఖా రేపు నేను ఎలానూ వైజాగ్ వెళ్తున్నాను గదా. నువ్వుకూడా నాతోపాటువస్తే మీ ఆఫీసరుగారి అమ్మాయిని చూసినట్లుంటుంది, పైగా ప్రమోషనుక్కూడా ఇది పనికివస్తుందిగా."

రేఖ దీనిగురించి ఆలోచిస్తున్నట్లు పోజుపెట్టి చివరకు "మా ఆఫీసరుగారమ్మాయిమాట అలావుంచి, మీరు రమ్మన్నారు గనుక తప్పుతుందా? వస్తాను కాని ఒక్కషరతు. మళ్ళీ మూడోరోజు ప్రొద్దున్నకల్లా ఇక్కడకుతిరిగిరావాలి." అనగానే వెంటనే ఒప్పేసుకున్నాను నేను.

ఎక్కింది ఎక్స్‌ప్రెస్ అయినా విశాఖపట్నం చేరేటప్పటికి రెండుగంటల ఆలస్యంతోపాటు ప్రొద్దున్నఏడయింది.

స్టేషనుకు దగ్గరలోవున్న లాడ్జిలోనే దిగాం, స్నానం ముగించేటప్పటికి బాగా ఆకలివేసింది. ఆర్డరిచ్చిన ఒక్క పదార్థంకూడా సహించలేదు రుచిగానేవున్నా. బాబ్జీనిఎప్పుడు చూస్తానా అన్న ఆతురతలో ఒక్కటి బాగున్నట్లు అన్పించలేదు. మనస్సులో ఏదో బరువుగావున్నట్లు ఫీలయ్యాను.

ఎదురుచూసిన సాయిత్రం ఎంతసేపటికి రాకపోగా, తీరా బయలుదేరే సమయానికి రేఖ మొండిపట్టు పట్టింది, తనురానని. పిచ్చివాళ్ళ ఆస్పత్రిని చూడాలంటే తనకి భయమని ఎంత చెప్పినా ససేమిరా రానందిరేఖ. నాకు కూడా అంతాకొత్తే. అందుకే రేఖతోడువుంటే ఎంతో బావుంటుంది. ఎంతచెప్పినా వినలేదు రేఖ. చెబితే అర్థంకాదు రేఖకు.

చివరకు ఒంటరిగానే బయలుదేరాను. బస్సు ఎక్కేటప్పటికి బ్రహ్మప్రళయం అయింది. చివరకు బస్సు ఎలాఅయితే ఎక్కాను.

ఒకవిధంగా పిచ్చాసుపత్రికి వెళ్ళాలంటేనాకుభయమే పైగా పిచ్చాసుపత్రి పెదవాల్తేరులో వుందన్నారు. బస్సువెళ్తుంటే ఆలోచించుకోవటానికి నాకుకావల్సినంత టైముంది, బాబ్జీవుండే ఆసుపత్రి ఎలావుంటుందోనన్న ఊహ నన్ను వుక్కిరి బిక్కిరిచేస్తూవుంది.

ఒకసారి నేను గుంటూరు ఆస్పత్రికి ఓడాక్టరు స్నేహితుడిని చూద్దామని వెళ్ళాను. అతను పైఅంతస్తులోఎక్కడో

వుంటాడని చెప్పారు. పైకిఎక్కబోతూవుంటే .ఓపదహారేళ్ళ
పడుచు నాచెయ్యి పట్టుకొంది. అనుకోని ఈసంఘటన నన్ను
మాటరానీయకుండా చెయ్యటానికి తోడు నాముఖం పాలి
పోయింది.

"బావా, బావా నాకో చీరకొనిపెట్టవూ!" అదరి
పోయాను. ఏంచెయ్యాలో అర్థంకాలేదు. పరుగెత్తటానికి
ఓపిక లేకపోయింది. గట్టిగా అరచేటప్పటికి ఎవరోవచ్చి ఆ
అమ్మాయిని లాక్కొని వెళ్ళిపోయారు: తర్వాత తెలిసింది
అది పిచ్చివాళ్ళు వుండే గదట!

అప్పట్నుంచి పిచ్చివాళ్ళంటే చచ్చేంత భయంనాకు.
ధైర్యంగా విశాఖపట్నం వరకు వెళ్ళినా లోపల బిక్కు
బిక్కు మంటూనేవుంది నాకు. బాబ్జీ అసలు నన్ను గుర్తు
పడతాడోలేదో ? గుర్తుపడితేమాత్రం సరిగా మాట్లాడాల
నేమిటి. మీదబడి కరిస్తేనో, గోళ్ళతో రక్కివేస్తేనో. భగ
వంతుడి దయవల్ల ఇవన్నీ జరగకుండావుంటే బాగుంటుంది
అనుకున్నాను.

పిచ్చాసుపత్రిదగ్గర బస్సు దిగాను. ఏం చెయ్యాలో
తెలియలేదు. లోపలికివెళ్ళి బాబ్జీసంగతి ఎవరిని అడగాలో
అర్థంకాలేదు, బాబ్జీఏవార్డులో వుంటాడో ఏమోఅనుకుంటూ
వుంటే గేటుముందు తారట్లాడే ఓమనిషిని చూసానునేను.
వాచ్ మెన్‌లాలేదు. చూడ్డానికి బాగానేవున్నాడు. పిచ్చి

లక్షణాలు ఏకోశానా లేనట్లైవుంది. కాస్త ధైర్యం వచ్చింది. దర్జాగా అడుగులు ముందుకు వేశాను.

"ఏమండీ ఇది పిచ్చివాళ్ళ ఆస్పత్రేకదూ ? ఇక్కడ పిచ్చివాళ్ళు, అంటే కొత్తగాచేరినవాళ్ళు ఎక్కడ..."మాట పూర్తిగాకుండానే ఆవ్యక్తి నావైపు తిరిగి నవ్వుతూ.

"ఏం వాళ్ళను చూడాలనివుందా ? చూడాలనివుంటే నావెనకేరండి: అందర్నీ చూపిస్తాను." అంటూ బయలుదేరిన అతనివెనక నేనూ వెంబడించాను. గేటు దాటి కొంచెందూరం వెళ్ళినతర్వాత ఒక పొదలాంటిది కన్పించింది అతను పరుగెత్తికెళ్ళి దానిచాటున దాక్కుని మళ్ళీ వెంటనే గుర్రంమీద స్వారీచేస్తున్నట్లువచ్చి, కత్తిదూసినట్లు దూసి నాడొక్కలో పొడిచి "ఏం పిచ్చివాళ్ళని చూస్తావా.... జాగ్రత్త ... హ హ హ నేను ఎం. జి. రామచంద్రన్ పెద్ద స్టంటు హీరోని" అని మళ్ళీ గుర్రంమీద స్వారీచేస్తున్నట్లు మాయమైపోయాడు.

నాకు ఒళ్ళంతా చెమటలుపట్టింది. నాలుక మీద తడారిపోయింది. ఏంచెయ్యాలో అర్థమే కాలేదు,

అదేపనిగా బస్టాండ్ దగ్గరవరకు పరుగెత్తాను.

లాడ్జికివెళ్ళగానే "రేఖా, ఈవైజాగ్ వద్దు, బాబ్జీగాడూ వద్దు. ఇక్కడ వుంటే నాక్కూడా పిచ్చి పట్టేటట్లుంది. ఇవ్వాళే మనవూరు బయలుదేరుదాం.' సామాను సర్దుతూ అన్నాను.

"ఏం బాబ్జీ హాస్పటల్లో లేడాఏం. పోనీ, లెండి మా ఆఫీసరుగారి అమ్మాయయినా కన్పించిందా లేదా? అయినా మీరింత త్వరగా వస్తారని అనుకోలేదు నేను...." రేఖ ఏమడిగినా అసలు ఏంజరిగింది నేను చెప్పలేదు. స్టేషనుకువెళ్ళి కంపార్టుమెంటు వెతుక్కుంటూ వెళుతున్నాను. మేము వెళ్ళక ముందే వచ్చినరైలు బయలు దేరటానికికూడా సిద్ధంగావుంది. ఏపెట్టెలోనూ ఖాళీ కన్పించ లేదు. కంపార్టుమెంటు వెతుకుతూ ఓఫస్టుక్లాసుదాంట్లోకి తొంగిచూసాను ఓ చక్కని యువకుడు నవ్వుతూ ఏదోచెప్తున్నాడు. ఎవడు వాడు 'బాబ్జీ' కదూ అనుకోబోయేటంతలో అదే కంపార్టుమెంటులోకి తనదృష్టి ప్రసరింపచేసి అతనిప్రక్కనే కులాసాగ కబుర్లుచెప్పే అమ్మాయిని చూసి "అరే ఆఅమ్మాయే మాఆఫీసరుగారి అమ్మాయి. పేరు కమల" అంది.

చేతిలోసంచి క్రింద జారిపడింది.

తెల్లబోయేటంతలో రైలు కూతవేసి బయలు దేరింది.

— ० —